క్లుప్తంగా

దర్గాలో భక్తుల సందడి



దర్గాలో ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. రంజాన్ మాసం కావడంతో భక్తులు దర్గాలోనే ఇఫ్తార్, ప్రత్యేక నమాజులను చేపట్టారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్ బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆదోని టౌన్: పట్టణంలో జరుగుతున్న పూడిక తీత పనులను మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ గురువారం పరిశీలించారు. అనంతరం పాత బస్టాండు సర్కిల్‌లోని అన్నా క్యాంటీన్‌లలో వడ్డిస్తున్న అల్పాహారం, భోజనాన్ని పరిశీలించారు. నాణ్యతగా భోజనం, టిఫిన్ వడ్డించాలని, లేనిపక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు.

పోషకాలతోనే సంపూర్ణ ఆరోగ్యం



శిక్షణ ఇస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఉమామహేశ్వరి

ఆదోని సెంట్రల్: గర్భిణులు, బాలింతలు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఉమామహేశ్వరి తెలిపారు. పట్టణంలోని ఆర్‌ఆర్‌లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ– పఢాయి బీ ఫేస్–2 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పోషణ్‌భీ కింద గర్భిణులకు బాలింతలకు అవసరమై పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు. వారు ఆరోగ్యవంతులుగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించాలన్నారు.

23న రాయలసీమ మాలల సింహ గర్జన

ఆదోని రూరల్: ఈనెల 23వ తేదీన తిరుపతిలో జరిగే హలో మాల చలో తిరుపతి రాయలసీమ మాలల సింహగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆదోని డివిజన్ మాల మహానాడు జేఏసీ నాయకులు కళ్లపోతుల రంగన్న, మాల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఆదోని పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో గురువారం మాల మహానాడు జేఏసీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు పోస్టర్లను విడుదల చేశారు. మాలలందరూ హాజరై సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమలో ఆదోని డివిజన్ మాల మహానాడు జేఏసీ నాయకులు కౌన్సిలర్ బాలాజీ, సి.ఆర్.స్వామి, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆంజనేయులు, బేగారి విట్టల్, గోవిందు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

నందవరం:అంగన్‌వాడీల్లోని చిన్నారుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పని చేయాలని సీడీపీఓ సఫరున్నీసా బేగం సూచించారు. గురువారం మండల పరిధిలోని ముగతి మోడల్ స్కూల్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'పోషణ భీ, పఢాయి భీ' అనే కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..ప్రీస్కూల్ యాక్టివిటీస్ 3 నుంచి 6ఏళ్ల పిల్లలకు మాత్రమే ఉండేవని, ఇప్పటి నుంచి 0 నుంచి 3 ఏళ్ల చిన్నారులపై దృష్టి సారించాలన్నారు. ప్రతి బిడ్డకు 3 సంవత్సరాల లోపే బ్రెయిన్ అభివృద్ధి చెందుతుందని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుచరిత, సుధావతి, రాధ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నందవరం: మండలంలోని కేజీబీవీలో 2025–26 విద్యాసంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశాలతో పాటు ఇంటర్మీడియెట్ ఎంపీసీ గ్రూపులో సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. 6వ తరగతికి సంబంధించి 40 సీట్లు, 10వ తరగతికి-03 సీట్లు, ఇంటర్మీడియెట్(ఎంపీసీ) మొదటి సంవత్సరానికి -40 సీట్లు, ద్వితీయ సంవత్సరానికి- 21సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్(బడిమానేసిన) పిల్లలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల బాలికలు http:// apkgbv.apcfss.in వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రైతన్నకు దక్కని భరోసా

- రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసిన కూటమి సర్కారు
- కళా విహీనంగా రైతు సేవా కేంద్రాలు
- రైతన్నలకు అందని సంక్షేమ పథకాలు, అమలుకాని హామీలు
- అన్నదాతకు తప్పని ఇబ్బందులు



జగ్గాపురం రైతు సేవా కేంద్రం

నందవరం : ఉన్న ఊరిలోనే రైతులకు సేవలందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతన్నాయి. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సాంకేతిక పరికరాలు తదితర పథకాలను అందించి గత ఐదేళ్ల పాటు రైతు భరోసా కేంద్రాలు రైతులను ఎంతగానో ఆదుకున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా కేవలం వాటి పేరు మార్చిందే తప్ప అన్నదాత అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకపోగా సేవలను నిలిపివేసింది. నిన్నటి వరకు రైతన్నలకు ఎంతగానో ఉపయోగపడిన కార్యాలయాల సేవలు నేడు నిరుపయోగంగా మారాయి.

మండలంలో 19 రైతు భరోసా కేంద్రాలు

రైతులకు ఉన్న ఊరిలోనే సేవలందించేలానే ఉద్దేశంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వ హయంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత ఐదేళ్లలో నందవరం మండలంలో 19 రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా 12, 371 మంది రైతులకు రూ. 60.83 కోట్లతో వివిధ పథకాల కింద యంత్రాలు, యంత్ర పరికరాలు, వరి కోత యంత్రాలు తదితరాలకు అందించారు. అలాగే ఉచిత పంటల బీమా కింద 13,166 మంది రైతులకు రూ.47.51 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. మండలానికి రూ. దీంతో గతంలో జగన్ సర్కార్ అన్నదాతకు అండగా నిలిచింది. అలాగే పంటలకు గిట్టుబాటు ధరలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, సాగు పంటలపై సలహాలు, సూచనలు, పంటల సంరక్షణ వంటి తదితర సేవలన్నీ రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించారు.

నేడు అందని కనీస సేవలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతు భరోసా కేంద్రాలకు రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పులో ఉన్నతం ప్రేమ రైతులపై లేకపోయింది. రైతులను మోసం చేసి నటేట్ట ముంచింది. రైతుల సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేదు. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం గాలికి వది లేసింది. రైతు సేవా కేంద్రాల నుంచి ఎరువులు కరువయ్యాయి. కనీసం రైతు సేవలను గాలికి వదిలేశాయి. సాగు పంటలపై సలహాలు, సూచనలు లేక సాగు పంటలకు చీడ పీడలు, తెల్లుళ్లతో దిగుబడులు పూర్తిగా తగ్గి రైతులు తీవ్ర నష్టాలను మూటకట్టుకున్నారు. గత వైఎస్సార్‌సీపీ సర్కార్ ప్రవేశపెట్టిన రైతు పథకాలకు మంగళం పాడింది. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు చెప్పిన ఏ ఒక్క హామీ నేరవేర్చలేదు.

ఎరువుల కొరత



గత ప్రభుత్వ హయంలో రైతులకు ఎరువులు, విత్తనాలు కొరత లేదు. ఏ సీజన్‌లో ఆ సీజనకు కావల్సిన ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైరులందరికీ సకాలంలో అందేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఎరువులు, విత్తనాలు కావాలన్నా ప్రైవేట్ షాపులకు వెళ్లాల్సిన వస్తుంది. రైతు భరోసా కేంద్రాల నుంచి అందిచే సేవలు పూర్తిగా తగ్గిపోయాయి.

– కురవ ఉరుకుందు, రైతు

సేవలు నిలిచిపోయాయి



ఏ ఒక్క రైతు ఎరువులు, విత్తనాల కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలను రూ.లక్షలు వెచ్చించి నిర్మించింది. నేడు అలాంటి కేంద్రాలు నిర్వీర్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో మండలంలోని రైతులు ఎరువులు, విత్తనాల కోసం పట్టణాలకు పరుగులు తీయవల్సి వస్తుంది. రైతుకు అందించే సేవలు నిలిచిపోయాయి.

– కోటేశ్వరరావు, రైతు

రైతులను విస్మరించిన కూటమి



రైతు భరోసా కేంద్రాలకు రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చిన కూటమి ప్రభుత్వం సేవాలను నిలిపి వేసింది. ప్రభుత్వం ఈ కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలతో పాటు ఉచిత పంటల బీమా, అన్నదాత సుఖీభవ పథకం, పంటల గిట్టుబాటు ధర వంటి సేవాలు కల్పించాలి. కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

–వెంకటేశ్వరరెడ్డి,వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు

భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆలయ డిప్యూటీ కమిషన ర్ విజయరాజుకు వినతి పత్రాన్ని అందజేశా రు. సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న మాట్లాడుతూ ప్రవ ఖ్య పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయం వద్ద తాగునీరు సరిగా లేక భక్తులకు ఇబ్బందులు పడుతున్నారన్నారు.అలాగే మరుగుదొడ్ల సౌకర్యం లేక మహిళలు అవస్థలు పడుతున్నారని, దీంతో పాటు డ్రైనేజీ సౌకర్యం లేక పోవడం వల్ల ఎక్కడి నీళ్లు అక్కడే నిలబడిపోతోందని తెలిపారు. కుంబాభిషేకం కోసం అంగళ్లను తీయడం వల్ల బస్టాండ్ ప్రాంతం చాల విశాలంగా ఉందని, ఇప్పటికైనా బస్సుల ను బస్టాండులో నిలబడే విధంగా చూడాలన్నారు. నాయకులు ఉలిగయ్య, గిరెప్ప, హనుమంతు, వన్నూర్, నరసన్న, వీరేష్ పాల్గొన్నారు.

ఐదు వేల మంది రక్తదానం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా 1998 నుంచి ఇప్పటి వరకు ఐదు వేల మంది దాతలు రక్తదానాలు చేసినట్లు ఆ సంస్థ న్యాయసలహాదారుడు నారాయణ, సంస్థ వ్యవస్థాపకులు తిరుమల, నాగేంద్రకుమార్ తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1998 అక్టోబర్ 2వ తేదీన గాంధీజయంతి సందర్భంగా సంస్థ ఏర్పాటు చేసి.. ఇప్పటి వరకు అనేక మార్లు రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. తమ సంస్థలో ఒక్కొక్కరు 20 నుంచి 50 సార్లు రక్తదానం చేసినట్లు వెల్లడించారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు మోగిన నగారా



మాట్లాడుతున్న న్యాయవాదులు

ఆదోని రూరల్: ఆదోని బార్ అసోసియేషన్‌కు ఎన్నికల నగారా మోగింది. పాత అధ్యక్ష, కార్యదర్శుల పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో గురువారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎన్నికలు నిర్వహించాలని తీర్మానం చేశారు. సీనియర్ న్యాయవాది మధుసూదన్‌రెడ్డి అధ్యక్ష స్థానానికి పోటీ పడుతున్నారు. ఈ ప్యానెల్‌లో కార్యదర్శిగా నెట్టికంటయ్య, ఉపాధ్యక్షుడిగా లోకేష్‌కుమార్ పోటీ చేస్తున్నారు. మరో సీనియర్ న్యాయవాది శ్రీరాములు అధ్యక్షుడిగా పోటీ చేస్తున్నారు. ఈ ప్యానెల్‌లో కార్యదర్శిగా ఎల్.కె.జీవన్‌సింగ్, ఉపాధ్యక్షుడిగా జె.వెంకటేశ్వర్లు పోటీ చేయనున్నారు. ట్రెజరర్‌గా రవీంద్ర, స్పోర్ట్స్ సెక్రటరీగా విష్ణుకశ్యప్, లైబ్రేరియన్‌గా మస్తాన్‌వలిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మెడికల్ కళాశాల పనులు పునఃప్రారంభించాలి



మెడికల్ కళాశాల భవనం ముందు ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఆదోని రూరల్: మెడికల్ కళాశాల పనులు పునః ప్రారంభించాలని, మెడికల్ కళాశాల ప్రైవేట్ పరం చేస్తే ఉపేక్షించేది లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్‌బాషా అన్నారు. గురువారం పట్టణంలోని ఆరేకల్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి బృందం సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.షాబీర్‌బాషా, జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా ఆదోని పట్టణానికి మెడికల్ కళాశాల పనులు దాదాపు 60 శాతం వరకు పూర్తి అయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక నిర్మాణ పనులు నిలిపివేయడం జరిగిందన్నారు. ఇప్పుడు రాష్ట్ర బడ్జెట్ లేదు, మెడికల్ కళాశాలను తాము నడపలేమని, ప్రైవేట్ సెక్టార్‌కి అప్ప జెబుతున్నామని ఆరోగ్యశాఖ మంత్రి చెప్పడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహ కార్యదర్శులు రంగస్వామి, శరత్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు దస్తగిరి, వీరేష్, ఏఐవైఎఫ్ పట్టణాధ్యక్షులు లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: జాతీయ క్షయవ్యాధి నివారణ కార్యక్రమాన్ని గురువారం ఆదోని పట్టణంలోని నేషనల్ నర్సింగ్ ఆఫ్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీహెచ్ఎస్ బాబురాజు, కళాశాల ప్రిన్సిపాల్ నిలోఫర్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. బాబురాజు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, దగ్గులో రక్తపుచారలు, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గిపోవడం, ఉదయం, సాయంత్రం జ్వరం ఉంటే వెంటనే ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి గల్ల పరీక్ష, ఎక్స్‌రే పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుబ్బమ్మబాయి, లలితమ్మ, భాస్కర్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

కూల్‌కూల్.. కలింగర



పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద విక్రయానికి వుంచిన కలింగర కాయలు

- ఊపందుకున్న పుచ్చకాయల విక్రయాలు
- సైజు, బరువును బట్టి రేటు

ఎమ్మిగనూరుటౌన్: ఓ వైపు వేసవి ఎండలు మొదలవడంతో ఎండేవేడిమి పెరిగిపోతుంది. ఎండలు ముదురుతుండటంతో ఎండవేడిమి నుంచి ఉపశమనం కలిగించడంతో పాటు ఔషధ గుణాలుండే పుచ్చకాయల(కలింగర) విక్రయాలు పట్టణంలో ఊపందుకున్నాయి. కొందరు వ్యాపారులు పుచ్చకాయల స్టాళ్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. మరి కొందరు వాటిని చిన్న చిన్న ముక్కలుగా కోసి ఒక్క ప్లేట్‌ల ప్రకారం విక్రయిస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి..

కడప, అనంతపురం, చెన్నై తదితర ప్రాంతాల్లో పుచ్చకాయలను వ్యాపారులు టన్ను రూ.14 వేల నుంచి రూ.18వేల వరకు కొనుగోలు చేసి తీసుకొని వస్తున్నట్లు స్థానిక వ్యాపారి హాజీవలి తెలిపాడు. స్థానిక అంబేడ్క ర్ సర్కిల్‌తో పాటు వైఎస్సార్ సర్కిల్ ప్రాంతంలో వ్యాపారులు కాయ సైజును బట్టి కొందరు విక్రయిస్తుండగా.. మరికొందరు కిలో రూ.30ల ప్రకారం అమ్ముతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నల్ల, తెల్ల చారలున్న పుచ్చకాయలను వ్యాపారులు కొనుగోలు చేసి తెస్తున్నారు. కాగా, స్మార్ట్ బజార్‌లలో కూడా విక్రయాలుండతో ప్రజలు అక్కడ పుచ్చకాయలను కొనుగోలు చేస్తున్నా బయట విక్రయించే కాయలు నాణ్యతగా వుండటంతో తమ వద్దే ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చేస్తున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

పుచ్చకాయల్లో పోషక విలువలెన్నో..

పుచ్చకాయలో పోషక గుణాలు ఎక్కువే. పుచ్చకాయలో విటమిన్‌బీ, పొటాషియం పుష్కలంగాను ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా లభిస్తాయి. వీటివల్ల కొత్తశక్తి లభిస్తుంది. పుచ్చకాయలో 92 శాతం ఆల్కలైన్ నీరు వుండటం వల్ల శరీరానికి ఎంతో ఉపయోకరంగా వుంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఇది తినడం ద్వారా రక్తపోటు తగ్గించి, మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇందులో వుండే పెటాకెరోటీస్ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. వృద్ధాప్యంలో వచ్చే అంధత్వ సమస్యను కూడా కొంత వరకు నివారించడంతో పాటు మూత్రపిండాల పనితీరు మెరుగుకు, ఆస్తమా, మధుమేహం లాంటి సమస్యలకు బాగా పనిచేస్తుంది. అలాగే రక్తప్రసరణ సక్రమంగా జరిగేలా చేయడం, సౌందర్యానికి కూడా ఉపయోగకరంగా పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

కార్మికులకు సరైన సౌకర్యాలు కల్పించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ పరిధిలో, ప్రధాన రహదారుల సమీపంలో నిర్వహిస్తున్న ఇటుకల బట్టీల్లో పని చేసే కార్మికులకు యాజమాన్యాలు సరైన సౌకర్యాలు కల్పించేలా తహసీల్దార్ చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, విజయేంద్ర డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటుకల బట్టీల్లో పనిచేసే కార్మికులకు బీమా సౌకర్యం లేదని, వుండేందుకు కనీస నివాసాలు ఏర్పాటు చేయలేదన్నారు. కార్మికులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా పనులు చేయించుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు వీరేష్, సుంకన్న, మల్లికార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలందించడంలో నిర్లక్ష్యం వద్దు



వైద్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌కు వచ్చే గర్భిణులు, రోగులకు సేవలందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం పట్టణంలోని ఖిబులా కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. గర్భిణులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, ఎంపీహెచ్‌ఈఓ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు క్లినిక్‌లు నిర్వహిస్తే చర్యలు

హాలహర్వి: అనుమతులు లేకుండా ఆర్‌ఎంపీలు క్లినిక్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ రఘురామిరెడ్డి ఆర్‌ఎంపీలను హెచ్చరించారు. గురువారం మండలంలోని గూళ్యం గ్రామంలోని ఆర్‌ఎంపీ క్లీనిక్, మందుల షాపులను తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీలు రోగులకు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని సూచించారు. ఇంజెక్షన్లు, సెలైన్ బాటిళ్లు పెట్టరాదని చెప్పారు. కొందరు ఆర్‌ఎంపీలు అనుమతులు లేకుండా మెడికల్ షాపులు, ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం అనుమతి లేకుండా మెడికల్ షాపులు, ల్యాబ్‌లు, క్లీనిక్‌లు నిర్వహించే వారికి నోటీసులు జారీ చేశారు. వైద్యాధికారులు మన్సూర్ వలి, సూపర్‌వైజర్ అబ్రహాం, ఏఎన్‌ఎంలు జయమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యకొండలో బాలికకు డెంగీ నిర్ధారణ



డెంగీపై అవగాహన కల్పిస్తున్న మలేరియా జిల్లా అసిస్టెంట్ అధికారి చంద్రశేఖర్

గోనెగండ్ల : మండల పరిధిలోని అయ్యకొండ గ్రామంలో 8 ఏళ్ల బాలికకు డెంగీ వ్యాధి నిర్ధారణ అయినట్లు మలేరియా జిల్లా అసిస్టెంట్ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. గ్రామంలో డెంగీ కేసు నమోదు కావడంతో గురువారం వైద్య సిబ్బంది, ఎంపీడీఓ మణి మంజరి, ఈఓఆర్డీ అనంతసేన, పంచాయతీ సిబ్బందితో వెళ్లి నివారణ చర్యలు చేపట్టారు. డెంగీ కేసు నమోదైన బాలిక ఇంటి పరిసరా ప్రాంతంలో నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల మందును పిచికారీ చేయించారు. గ్రామస్తులకు డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్‌ఓ హనుమంతు, సూపర్‌వైజర్ పర మేశప్ప తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్

ఆదోని సెంట్రల్: ఆదోని మండలం మండిగిరి గ్రామా పంచాయితీ పరిధిలో పైపులైన్ లీకేజి మరమ్మత్తులు చేపట్టాలని ఈ నెల 11వ తేదీన కథనం ప్రచురితమైంది. అందుకు స్పందించిన అధికారులు పైపులైన్ లీకేజీ మరమ్మతులను చేపట్టారు. అయితే మరమ్మతులు చేసిన చోట సగం రహదారి వరకు గుంత ఏర్పడింది. దీంతో వాహనదారులు, పాదచారులు రాక పోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి గుంత ఏర్పడిన చోట రహదారికి మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



పైపులైన్‌కు మరమ్మతు చేపట్టిన దృశ్యం

ముగిసిన రంగనాథుడి బ్రహ్మోత్సవాలు

- భక్తిశ్రద్ధలతో శ్రీవారికి పాన్పుసేవ



శ్రీవారికి పాన్పుసేవ నిర్వహిస్తున్న పండితులు

మద్దికెర : పెరవలిలో శ్రీరంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం శ్రీవారి పాన్పు సేవతో వైభవంగా ముగిశాయి. ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి బిందె సేవ, అభిషేకం, అష్టోత్తర నామార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో కొలువుంచి ఆలయ చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చివరగా..ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో శ్రీరంగనాథుడికి పాన్పు సేవ జరిపించారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

- మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలు
- బాధిత కూలీలంతా అగ్రహారం గ్రామస్తులే..
- బాపురం పొలాల్లో మిరప కోతలకు వెళ్తుండగా హాలహర్వి వద్ద ఘటన



గాయపడిన యువతి ఐశ్వర్య



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాధమ్మ

ఆలూరు రూరల్: వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ముగ్గురు కూలీలు తీవ్రంగా గాయపడగా ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఆటోలో వెళ్తున్న కూలీలంతా మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన వారే. గురువారం ఉదయం హాలహర్వి మండల కేంద్రానికి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. బాధితుల బంధువులు తెలిపిన మేరకు వివరాలు.. మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన 13 మంది వ్యవసాయ కూలీలు హాలహర్వి మండలం బాపురం గ్రామంలో మిరప పంట కోతలకు అప్పీ ప్యాసింజర్ ఆటోలో బయలుదేరారు. ఉదయం 7 గంటల సమయంలో హైవే 167లో ఉన్న హాలహర్వి పెట్రోల్ పంపు వద్ద ఆటో అదుపు తప్పి కిందపడింది. ప్రమాదంలో ఐశ్వర్య,రాధమ్మ, లింగమ్మ తలలకు తీవ్రగాయాలయ్యాయి. విజయలక్ష్మీతో పాటు ఏడుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ సభ్యులకు సత్కారం



మండల ఉపాధ్యక్షుడు అల్లబకాష్, కమిటీ సభ్యులను సన్మానించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

గోనెగండ్ల : ఇటీవల నియాకమైన వైఎస్సార్‌సీపీలో మండల కమిటీ సభ్యులను గురువారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఆక్టివిటీ కార్యదర్శి టీ. నాగేష్ నాయుడు, నాయకులు అభినందిస్తూ.. సత్కరించారు. మండల ఉపాధ్యక్షుడిగా పేట అల్లా బకాష్, జనరల్ సెక్రటరీలుగా కురువ పెద్ద లింగన్న, బోయ శ్రీనివాసులు, పలువురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమిస్తూ పార్టీ అధిష్టానం ప్రకటించింది. వారు మాట్లాడుతూ.. మాట్లాడుతూ తమకు పార్టీలో మండల కమిటీలో పదవి కల్పించడం ఆనందంగా ఉందని, పార్టీలో ప్రతి ఒక్కరికీ రుణ పడి ఉంటామన్నారు. పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తాయప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు రవి కుమార్ నాయుడు, తోలు రాముడు, దుబ్బన్న, మళ్లి, ఊసేన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు
97054 44304 (ఆదోని)
70750 09147 (ఎమ్మిగనూరు, మంత్రాలయం)
Office mail : sakshiknladvt@gmail.com